
సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 7 । అక్టోబర్ । 2025



ఎస్సారెస్పీ 26 గేట్లు ఓపెన్

జగిత్యాలఅగ్రికల్చర్: ఎస్సారెస్పీ ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు భారీగా వస్తుండటంతో 26 గేట్లు ఎత్తి 1,01,480 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.



స్థానికంలో కాసుల గోల

గోదావరిఖని: ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉంది. నిబంధనల ప్రకారం రూ.50వేలకు మించి నగదు తరలించరాదని చెబుతూ, పోలీసులు తనిఖీలు విస్తృతం చేశారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.0/24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం అధికంగా నమోదు అవుతుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రైళ్లన్నీ రద్దీ



ప్రయాణికులతో కిక్కిరిసిన రైలు

రామగుండం/ఓదెల(పెద్దపల్లి): దసరా పండుగ సెలవులు ముగిశాయి. పండుగ కోసం స్వస్థలాలకు వచ్చిన ప్రజలు తిరుగు ప్రయాణం అవుతున్నారు. దీంతో సికింద్రాబాద్, హైదరాబాద్ తదితర ప్రాంతాల వైపు వెళ్తున్న రైళ్లు సోమవారం ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా భాగ్యనగర్, బల్హార్షా, ఇంటర్‌సిటీ, సింగరేణి, కాగజ్‌నగర్, దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రయాణికులతో నిండిపోయాయి. ప్రయాణం చేసేందుకు ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

వృత్తి శిక్షణ కోర్సుల్లో చేరాలి



లలిత్‌కుమార్

గోదావరిఖని: సింగరేణి యాజమాన్యం ఉచితంగా అందించే వృత్తి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని రాణించాలని ఆర్జీ– వన్ జీఎం లలిత్‌కుమార్ కోరారు. సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళల జీవనోపాధి కోసం టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్స్, స్పోకెన్ ఇంగ్లిష్, క్లాత్/జూట్/బంజారా బ్యాగ్స్ తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు గనుల సంక్షేమాధికారులు, డిపార్ట్‌మెంట్లు, జీఎం కార్యాలయంలోని పర్సనల్ విభాగం, సింగరేణి సేవా సమితి కార్యాలయంలో దరఖాస్తు ఫారాల కోసం సంప్రదించాలన్నారు. ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్స్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈనెల15లోగా సింగరేణి సేవా సమితి కార్యాలయంలో నేరుగా దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

టీబీ బాధితులను గుర్తించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీవాణి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో క్షయ(టీబీ) బాధితులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో వాణిశ్రీ సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులతో జరిగిన సమావేశంలో పలు అంశాలపై సమీక్షించారు. క్షయ బాధితులకు ఉచితంగా మందులు అందించి, సక్రమంగా వాడేలా ప్రోత్సహించాలని అన్నారు. ఇంటింటా జ్వర సర్వే చేయాలని ఆమె అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసూతి సేవలు పొందేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సూచించారు. తెలంగాణ నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ ప్రోగ్రాం యాప్ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఎన్‌సీడీ స్క్రీనింగ్ నిర్వహణ సమయంలో వివరాలు నమోదు చేయాలని అన్నారు. అధికారులు రాజమౌళి, శ్రీరాములు, సుధాకర్ రెడ్డి, కిరణ్‌కుమార్, మధుసూదన్, రాజేశం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సమావేశం



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీధర్

మంథని: స్థానిక మాతా శిశు, సామాజిక వైద్యశాలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై మంత్రి శ్రీధర్‌బాబు కార్యాలయంలో జిల్లా ఆస్పత్రుల సూపరింటెండెంట్ శ్రీధర్ సోమవారం సమావేశం నిర్వహించారు. కార్మికులు, కార్మిక సంఘం నాయకులు హాజరయ్యారు. వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ ఇతరత్రా సౌకర్యాలపై చర్చించారు. దసరా పండుగవేళ తాము పస్తులు ఉన్నామని ఈనెల 1న కార్మికులు మంత్రి కార్యాలయానికి చేరుకున్న విషయం విదితమే. అప్పుడు స్పందించిన మంత్రి.. అదేరోజు కార్మికులకు వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నారు. వారితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరించాలని మంత్రి ఆదేశాలు జారీచేశారు. దీంతో జిల్లాస్థాయి అధికారి కార్మికులతో ప్రత్యేకంగా సమావేశమై సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పీఏ చంద్రశేఖర్, మంథని ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్, ప్రజాసంఘాల నాయకులు బూడిద గణేశ్, ఆర్ల సందీప్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

స్థానికం.. సందిగ్ధం



- షెడ్యూల్ విడుదలైనా తొలగని ఉత్కంఠ
- 8న హైకోర్టు తీర్పుపైనే అందరిచూపు
- తేల్చిన రిజర్వేషన్లు నిలిచేనా? అని అందరిలోనూ అనుమానాలు
- ముందస్తు ఖర్చుకు వెనుకడుగు వేస్తున్న ఆశావహులు
- ఆశలు వదులుకోని జనరల్ అభ్యర్థులు

సాక్షి పెద్దపల్లి: ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసినా.. ఆశావాహుల్లో ఉత్కంఠ తొలగడంలేదు. రిజర్వేషన్లు ప్రకటించినా.. అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. కలిసోచ్చిన వారు ప్రచారం చేసుకోవాలో.. వద్దో తెలియక.. డైలామాలో పడిపోయారు.. రిజర్వేషన్ కలిసిరాని వారు కోర్టు తీర్పు తమకే అనుకూలంగా వస్తుందనే ధీమాలో ఉన్నారు.

రోజులు లెక్కబెట్టుకుంటున్నారు..

సోమవారం బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా నమోదైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఈనెల 8న హైకోర్టు తీర్పుకోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం తీర్పు కోసం రోజులు లెక్కబెట్టుకుంటున్నారు. ప్రస్తుతం ఖరారైన స్థానాల్లో పోటీకి ఉవ్విళ్లూరుతున్న వారికి రిజర్వేషన్లు చెల్లుబాటవుతాయా? హైకోర్టు.. ఎన్నికల ప్రక్రియ మొత్తాన్ని రద్దు చేస్తుందా? అనే విషయంపైనే ఏ నలుగురు కలిసినా పల్లెల్లో చర్చించుకోవడం కనిపిస్తోంది.

హైకోర్టు తీర్పుపైనే అందరి దృష్టి

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవోకు వ్యతిరేకంగా దాఖలైన పిటీషన్‌పై ఈనెల 8న హైకోర్టు విచారణ జరుపనుంది. షెడ్యూల్ విడుదల తర్వాత కోర్టులు ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోవంటున్నారు. కానీ.. రాష్ట్రప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్లు పెంచింది. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యేలోపే పలువురు కోర్టును ఆశ్రయించారు. అయితే, షెడ్యూల్ ప్రకటించినా.. తాము పిటిషన్‌పై విచారణ చేపడతామని కోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. అయితే, పెంచిన రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికల నిర్వహణకు కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇస్తుందా? లేక అభ్యంతరం చెబుతుందా? అనేది ఆసక్తికరంగా మారింది.

కొత్త జీవోనా? పాతదేనా?

ఒకవేళ బీసీ రిజర్వేషన్ల పెంపు గతంలో సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమని హైకోర్టు అభిప్రాయపడితే.. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి లోబడి ఖరారు చేసేందుకు ప్రభుత్వం కొత్తగా జీవో ఇవ్వాల్సి ఉంటుందని నిపుణులు వివరిస్తున్నారు. అలాగే ప్రస్తుతం విడుదల చేసిన షెడ్యూల్‌ను రద్దు చేసి, కొత్తది ప్రకటించక తప్పదని అధికార వర్గాల్లో చర్చ జరుగుతున్నది. అప్పుడు గతంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో బీసీలకు 23 శాతం, ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 9 శాతం రిజర్వేషన్ల ఆధారంగా సీట్లు కేటాయించాలి. అప్పుడు ఎస్సీ, ఎస్టీల స్థానాల సంఖ్య మారకపోయినా, బీసీల స్థానాలు తగ్గి జనరల్ స్థానాలు పెరగనున్నాయని అంటున్నారు. దీంతో జనరల్ స్థానాల్లో పోటీచేసే అభ్యర్థులు తమకు ఇంకా అవకాశం ఉందనే భావనలో ఉన్నారు.

ఖర్చుపై ఆచీతూచీ..

జిల్లాలో 137 ఎంపీటీసీ, 13 జెడ్పీటీసీ, 263 పంచాయతీ, 2,432 వార్డులు ఉన్నాయి. మొత్తంగా అన్నీ కలిపి 2,845 స్థానాలు ఉన్నాయి. ఒక్కోస్థానానికి ముగ్గురు చొప్పున లెక్క వేసుకున్నా దాదాపు 8,535మంది అభ్యర్థులు స్థానిక సంస్థల్లో వివిధ పదవుల కోసం బరిలో నిలిచే అవకాశం ఉంది. ఇందులో ఎస్సీ, ఎస్టీ, జనరల్ స్థానాలకు రిజర్వేషన్లు కలిసి వచ్చినవారు పండుగ పేరుతో దావత్‌లు ఇవ్వగా, బీసీలకు రిజర్వేషన్ కేటాయించిన స్థానాల్లో.. బరిలో నిలిచే ఆశావాహుల్లో పలువురు కోర్టు తీర్పు ప్రతికూలంగా వస్తే ఎట్లా? అనే భావనతో ఖర్చు పెట్టేందుకు ఆచీతూచీ అడుగులు వేస్తున్నారు. మొత్తంగా ఇప్పుడు అందరిచూపు హైకోర్టు తీర్పుపైనే నెలకొంది.

యూరియా పంపిణీపై అప్రమత్తం

- ఈనెలాఖరు వరకు కొరత రానీయొద్దు
- కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలో యూరియా పంపిణీ విషయంలో సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉంటూ.. ఈనెలాఖరు దాకా కొరత రాకుండా చూడాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం వ్యవసాయాధికారులతో యూరియా పంపిణీపై సమీక్ష నిర్వహించారు. పంటల సాగు అవసరాలకు యూరియా అందించామని, అధికారులు ఏమరుపాటుగా ఉండొద్దన్నారు. ఈ నెలాఖరు దాకా యూరియా కోసం వచ్చే రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. జిల్లా నుంచి పొరుగు జిల్లాలకు యూరియా తరలిపోకుండా పటిష్ట నిఘా ఉంచాలన్నారు. అలాగే పంట దిగుబడులు చేతికందే సమయం ఆసన్నమవుతోందని, ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, తూకం యంత్రాలు, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా అధికారయంత్రాంగం అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పెద్దపల్లి, మంథని ఏడీఏలు శ్రీనాథ్, అంజని పాల్గొన్నారు.

న్యూఇండియా పార్టీకి షోకాజ్‌నోటీసు

న్యూ ఇండియా పార్టీకి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి షోకాజ్ నోటీసు జారీ చేశారని కలెక్టర్, జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి కోయ శ్రీహర్ష తెలిపారు. నిబంధనల ప్రకారం నియామక ఆడిట్ అకౌంట్స్ సమర్పించాల్సి ఉంటుందన్నారు. కానీ న్యూఇండియా పార్టీ 2021–22, 2022–23, 2023–24 ఆర్థిక సంవత్సరాలకు ఆడిట్ వివరాలను సమర్పించని కారణంగా నోటీసు జారీ చేసినట్లు వివరించారు. పార్టీ గుర్తింపు విషయంలో వివరణను బట్టి తదుపరి చర్యలు ఉంటాయన్నారు.

రేపు జాబ్‌మేళా

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని విద్యావంతులైన నిరుద్యోగ యువతకు టెలి పెర్ఫార్మెన్స్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు బుధవారం (ఈనెల 8వ తేదీన) జాబ్ మేళా నిర్వహిస్తామని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. పాత ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని 'టాస్క్' సెంటర్‌లో మేళా ఉంటుందన్నారు. కస్టమర్ సర్వీస్ అసోసియేట్ కంటెంట్ మోడరేటర్, అనలిస్ట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఏదైనా డిగ్రీ, బీటెక్ లేదా పీజీ ఉత్తీర్ణులై, వయసు 18ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు సర్టిఫికెట్ల జిరాక్స్‌తో పాటు బయోడెటాతో హాజరు కావాలని సూచించారు. వివరాలకు 90595 06807 మొబైల్ నంబరులో సంప్రదించాలని కలెక్టర్ కోరారు.

హామీలు గుర్తుచేసేందుకే 'బాకీకార్డు'

- ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీయాలి
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్



కల్వచర్లలో మాట్లాడుతున్న పుట్ట మధు

రామగిరి(మంథని): అమలుకు సాధ్యంకాని హామీలను అసెంబ్లీ ఎన్నికల సమయంలో గుప్పించిన కాంగ్రెస్.. అధికారంలోకి రాగానే విస్మరించిందని మంథని మాజీఎమ్మెల్యే పుట్ట మధుకర్ విమర్శించారు. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ 'కాంగ్రెస్ బాకీకార్డు' ఉద్యమం ప్రారంభించిందన్నారు. కల్వచర్ల గ్రామంలో సోమవారం గడపగడపకూ తిరుగుతూ బాకీకార్డు గురించి ప్రజలకు వివరించారు. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ అబద్ధపు వాగ్దానాలు చేసిందని ఆయన పేర్కొన్నారు. ప్రజలు వాటిని మరిచి పోయారనే భ్రమలో కాంగ్రెస్ నేతలు ఉన్నారని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు జాపతి శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్, నాయకులు నాగెల్లి సాంబయ్య, రవీందర్, కుమార్ యాదవ్, సైండ్ల సత్యనారాయణ, రేండ్ల అశోక్, బొంకూరి పోచం, మల్యాల మోహన్, మెట్టు కిష్టయ్య, మొసలి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్ అద్దె తగ్గించాలి

- టీబీజీకేఎస్ నాయకుల వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

గోదావరిఖని: పెంచిన కమ్యూనిటీహాల్ అద్దె తగ్గించాలని టీబీజీకేఎస్ ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్ కోరారు. జీఎం కార్యాలయంలో ఎస్‌వోటూ జీఎం రాముడును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ, కమ్యూనిటీ హాల్ అద్దెను రూ.558 నుంచి రూ.15వేలకు ఒకేసారి పెంచడంతో కార్మిక కుటుంబాలపై ఆర్థికభారం పడుతుందన్నారు. కొన్ని ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్లు రూ.25వేలకే టెంట్ సామానుతో సహా అద్దెకు ఇస్తున్నాయని ఆయన గుర్తుచేశారు. పోతనకాలనీలో ఆరు నెలల క్రితమే నిర్మాణం పూర్తిచేసిన కమ్యూనిటీహాల్‌ను వెంటనే ప్రారంభించి వినియోగంలోకి తేవాలని కోరారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, బేతి చంద్రయ్య, శ్రీనివాసరెడ్డి, రవితేజ, దాసరి శ్రీనివాస్, వెంకటేష్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో కిక్కిరిసిన పేషెంట్లు



రిజిస్ట్రేషన్ కౌంటర్ల ఎదుట బారులు తీరిన పేషెంట్లు

- ఒక్కరోజే 1,226 ఓపీ నమోదు

కోల్‌సిటీ(రామగుండం): బతుకమ్మ, దసరా పండుగల సెలవుల్లో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్) ఓపీ విభాగం కాస్త నిశ్శబ్దంగా కనిపించింది. కానీ, సెలవులు ముగిశాక.. సోమవారం ఒక్కరోజే పేషెంట్లు భారీగా తరలివచ్చారు. వారిరాకతో ఆస్పత్రి కిక్కిరిసిపోయింది. ఉదయం నుంచి పెద్దసంఖ్యలో చేరుకోవడం ప్రారంభం కావడంతో రిజిస్ట్రేషన్ కౌంటర్ల నుంచి ఓపీ గదుల వరకు క్యూలు కనిపించాయి. పాత, కొత్త పేషెంట్లతో కలిపి ఒక్కరోజే మొత్తం 1,226 ఓపీ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. నొప్పులు, ఇతర వ్యాధులతో పండుగ సెలవుల్లో ఓపిక పట్టిన వారు సోమవారం ఆస్పత్రికి తరలివచ్చారు. కొందరికి సాధారణ జ్వరాలు, దగ్గు, శ్వాస సంబంధిత సమస్యలు ఉండగా, మరికొంతమంది పాత నొప్పులు, అనారోగ్య సమస్య పరిష్కారానికి వచ్చారు. సెలవుల తర్వాత ఒక్కసారిగా రద్దీ పెరగడంతో గంటల తరబడి క్యూలో నిలబడి ఇబ్బందులు పడ్డారు. కొందరైతే వైద్యం పూర్తయ్యేలోపు మధ్యాహ్నం తర్వాత కూడా ఆస్పత్రిలోనే ఉండిపోయారు.

'అవార్డు' విచారణపై అభ్యంతరాల స్వీకరణ



మాట్లాడుతున్న ఆర్డీవో సురేశ్

రామగిరి(మంథని): రత్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధి మేడిపల్లి శివారులోని ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకు 210 ఎకరాల భూ సేకరణకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అభ్యంతరాలు స్వీకరించారు. పార్క్ ఏర్పాటుపై రైతులకు నోటీసులు జారీచేయగా ఏమైనా మార్పులు, చేర్పుల సవరణకు సంబంధించిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో సురేశ్ భూనిర్వాసితులకు సూచించారు. తహసీల్దార్ సుమన్, గిర్దావర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి


- కాంగ్రెస్ ప్రభుత్వం పైసా ఇవ్వలేదు
- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

రామగిరి(మంథని): రాష్ట్రప్రభుత్వం సింగరేణికి బకాయిపడ్డ రూ.43వేల కోట్లను వెంటనే చెల్లించాలని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆర్జీ–3 ఏరియా ఓసీపీ–2పై ఏరియా కార్యదర్శి రౌతు రమేశ్ అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాం నుంచి బకాయిలు ఉన్నాయని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బకాయిలు చెల్లిస్తుందనుకుంటే పైసా ఇవ్వడం లేదన్నారు. సింగరేణి తప్పుడు లాభాలు ప్రకటించి కార్మికులను మోసం చేసిందని ఆరోపించారు. సింగరేణి లాభాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ ప్రధాన కార్యదర్శి సారంగపాణి, ఏరియా ఉపాధ్యక్షుడు ఆర్కాల ప్రసాద్‌గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి వేణుగోపాలరావు, నాయకులు గోగుల విద్యాసాగర్, మర్రి సంతోష్, కె.శ్రీనివాస్, కాసెట్టి నగేశ్, బండారి శ్రీనివాస్, గోగుల రవీందర్, పొన్నగంటి శ్రీనివాస్ ఎండీ జానీ మియా తదితరులు పాల్గొన్నారు.

విస్తరణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

గోదావరిఖని: రాజీవ్ రహదారిపై బీ – గెస్ట్‌హౌస్ వద్ద అత్యంత ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు విస్తరణ పనులను సోమవారం ప్రారంభించారు. టౌన్‌ప్లానింగ్ అధికారుల ఆధ్వర్యంలో హెచ్‌కేఆర్ పనులు చేపట్టింది. కాంగ్రెస్ నాయకులు మహంకాళి స్వామి, దీటి బాలరాజు, సింగరేణి శ్రీనన్న పనులు ప్రారంభించారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణకు విస్తరణ పనులు చేపట్టామని నాయకులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే అనేక వాహనాలు అదుపుతప్పి బోల్తాపడుతున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని మూలమలుపు ప్రాంతాన్ని విస్తరించి అందంగా తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందించారు.

కొలిక్కి వచ్చేనా?

- రాఘవాపూర్ శివారులో పదెకరాలు కేటాయింపు
- అవసరమైన నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- కుదరని ఏకాభిప్రాయం.. పనుల ఆరంభంలో జాప్యం
- ఎటూతేలని జిల్లా కోర్టు భవన సముదాయం పనులు



అద్దె భవనంలోని న్యాయస్థానాలు

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రధాన న్యాయస్థానం, సీనియర్, జూనియర్ జడ్జి కోర్టులు అన్నింటినీ ఒకే సముదాయంలో నిర్మించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఇటీవల స్థలం కేటాయించి, నిధులు కూడా మంజూరు చేసింది. అయినా, న్యాయవాదుల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. దీంతో కోర్టు భవన సముదాయం పనులు ఇంకా ప్రారంభానికి నోచుకోవడంలేదు. జిల్లా కేంద్రమైన పెద్దపల్లి పట్టణంలో కోర్టు భవన సముదాయం నిర్మాణానికి అవసరమైనంత స్థలం అందుబాటులో లేదు. అధికారులు కేటాయించిన స్థలం పట్టణానికి దూరంగా ఉంది. దీంతో కేటాయించిన స్థలంపై న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా కోర్టు భవన సముదాయం పనులు కొలిక్కి రావడంలేదు.

కన్నాలలో కాలుష్యం ఉందని..

జిల్లా కోర్టు భవన సముదాయం నిర్మాణానికి అందుగులపల్లి శివారులో (ధర్మారం క్రాస్‌రోడ్డు సమీపంలో) రాజీవ్ రహదారి పక్కనే స్థలం కేటాయించారు. ఆ ప్రాంతంలో క్వారీ, క్రషర్లు ఉండడం, వాటినుంచి దుమ్ము, ధూళి వెలువడుతాయని స్థల పరిశీలనకు వచ్చిన న్యాయవాద బృందానికి విన్నవించారు. దీంతో అక్కడ పనులు ఆగిపోయాయి. ఆ తర్వాత స్థల అన్వేషణ మళ్లీ మొదలైంది.

రాఘవాపూర్‌లో నిర్మిస్తారని?

పెద్దపల్లి మండలం రాఘవాపూర్ వద్ద కోర్టు భవన సముదాయానికి పదెకరాలు కేటాయించారు. జిల్లా కేంద్రంలోని కోర్టులన్నీ ఒకేసముదాయంలో ఉండడం, పెద్దపల్లి పట్టణానికి కేవలం మూడు, నాలుగు కిలో మీటర్ల దూరంలోపే ఉండడం, వాహనాల పార్కింగ్, జడ్జిల నివాసాలకు అవసరమైనంత విశాలమైన స్థలం అందుబాటులో ఉండడంతో కోర్టు భవన సముదాయం పనులు ప్రారంభానికి సన్నాహాలు చేశారు. ప్రభుత్వం కూడా నిధులు మంజూరు చేయడంతో పనులు మొదలవుతాయని అందరూ ఆశించారు. కానీ, ఆ ప్రాంతం కోర్టు నిర్మాణానికి అనువుగా లేదంటూ కొందరు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.

స్థల సమస్యను కారణంగా చూపి..

పెద్దపల్లికి మూడు దశాబ్దాల కాలం క్రితమే మంజూరైన ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటుకు స్థల సమస్య కారణం కావడంతో గోదావరిఖనికి తరలిపోయింది. పలు కార్యాలయాలు కూడా స్థల సమస్యతోనే ఇతర ప్రాంతాలకు తరలివెళ్లి పోయాయి. తాజాగా ఆ జాబితాలోకి కోర్టు భవన సముదాయం చేరింది. స్థలం కేటాయించి నిధులు సిద్ధంగా ఉన్నా న్యాయవాదుల మధ్య సఖ్యత లేక సమస్య తలెత్తిందనే వాదనలు వినిపిస్తున్నాయి.

తరలిపోయే ప్రమాదం ఉంది?

న్యాయవాదుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే జిల్లాకోర్టు భవన సముదాయాన్ని మరో నియోజకవర్గ నేతలు తరలించుకుపోయే ప్రమాదం పొంచి ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారు. ఇప్పటికైనా పెద్దపల్లి పట్టణానికి కూతవేటు దూరంలో ఉన్న రాఘవాపూర్‌లో కోర్టు భవన సముదాయానికి కేటాయించిన విశాలమైన స్థలంలోనే వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చూడాలని పెద్దపల్లి బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఇటీవల ఎమ్మెల్యే విజయరమణారావును కలిసి విన్నవించారు.

ఏకాభిప్రాయంతో ముందుకు



జిల్లా కోర్టు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి, పోక్సో, జువైనల్ లాంటి అనేక కోర్టులు ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఉన్నాయి. వాటిలో చాలా వరకు అద్దెభవనాల్లో అరకొరవసతుల మధ్య పనిచేస్తున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రాఘవాపూర్‌లో పదెకరాల స్థలం కేటాయించింది. అన్నికోర్టులు ఒకేసముదాయంలో నిర్మించేలా అందరం ఏకభిప్రాయంతో ముందుకు సాగుతాం. వీలైనంత త్వరగా పనులు ప్రారంభించుకునేలా చూస్తాం.

– లకిడి భాస్కర్, అధ్యక్షుడు, పెద్దపల్లి బార్ అసోసియేషన్

క్లుప్తంగా

బావిలోపడి వృద్ధురాలి మృతి

పాలకుర్తి(రామగుండం): పుట్నూర్ గ్రామంలో అష్టకల శాంతమ్మ(90) సోమవారం బావిలోప డి మృతిచెందింది. స్థానికులు, పోలీసుల కథ నం ప్రకారం.. శాంతమ్మ తన చిన్న కుమారుడు మధుకర్ ఇంట్లో ఉంటోంది. రోజూ మాదిరిగానే అందరూ నిద్రకు ఉపక్రమించారు. తెల్లవారు జామున లేచి చూసేసరికి కనిపించలేదు. తన ఇంటిసమీపంలోని సోదరుడు రవి ఇంటికి వెళ్లిఉంటుందని భావించారు. అక్కడా కనిపించలేదు. దీంతో పరిసరాల్లో వెతుకుతుండగా చేదబావి వద్ద శాంతమ్మ చేతికర్ర కనిపించింది. అనుమానంతో అందులో చూడగా మృతదేహం కనిపించింది. రాత్రివేళలో బహిర్భూమికి వెళ్లేందుకు యత్నించిన శాంతమ్మ.. ప్రమాదవశాత్తు బావి లో పడి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తు న్నారు. ఈ మేరకు ఎస్సై స్వామి కేసు నమోదు చేసుకున్నారు. అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరి.. శాంతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్య

వీణవంక: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్టీసీ డ్రైవర్ పంజాల మల్లయ్య(67) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఇరవై ఏళ్లుగా షుగర్ వ్యాధితో బాధపడుతూ ఆసుపత్రుల చుట్టూ తిరిగినా వ్యాధి నయం కాలేదు. ఇన్‌ఫెక్షన్‌తో కుడికాలు తీసివేయాలని వైద్యులు సూచించడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదుతో కేసుదర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఆవుల తిరుపతి తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి..


కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని బుట్టిరాజరాంకాలనీకి చెందిన శ్రీనివాస్ ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెయింటర్‌గా పనిచేస్తున్న శ్రీనివాస్‌కు భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ప్రతిరోజూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం మద్యం సేవించి ఇంటికి వచ్చి నిద్రపోతానని చెప్పి బెడ్రూం గడియపెట్టుకున్నాడు. సాయంత్రం ఎంతపిలిచినా లేవకపోవడంతో అతని భార్య స్వప్న తన మరిది శ్రీకాంత్‌కు సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి తలుపు గడియ తెరిచి చూసేసరికి ఉరేసుకొని కనిపించాడు. ఈమేరకు మృతుడి భార్య సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మృతి

శంకరపట్నం: మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన యువకుడు కటికరెడ్డి సుమంత్(24) చికిత్స పొందుతూ మృతిచెందాడని ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. మద్యానికి బానిసైన సుమంత్ బైక్ ఈఎమ్‌ఐ చెల్లించలేక ఆదివారం గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడని, సుమంత్ పెద్దనాన్న సంపత్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

తల్వార్‌తో విన్యాసాలు చేసిన వ్యక్తిపై కేసు

వెల్గటూర్/పాలకుర్తి : అమ్మవారి ఊరేగింపులో తల్వార్‌తో విన్యాసాలు చేసిన వ్యక్తిపై కేసు న మోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బసంత్‌నగర్ ఎస్సై స్వామి తెలిపారు. ఈనెల 3న ముంజంపల్లిలో అమ్మవారి ఊరేగింపు చేపడుతుండగా.. బైరం హరీశ్ తల్వార్ తీసుకొచ్చి విన్యాసాలు చేసి అక్కడున్నవారిని భయభ్రాంతులకు గురిచేశాడు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు హరీ శ్‌పై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.



స్థానికంలో కాసుల గోల

- పెళ్లిళ్ల సీజన్.. బ్రాందీ షాపుల టెండర్లు
- రూ.50వేలకుపైగా ఉంటే సీజ్ చేస్తున్న పోలీసులు

స్వాధీనం చేసుకున్న సొత్తు	
మంచిర్యాల జిల్లా:	
నగదు	రూ.4.48లక్షలు
లిక్కర్	146లీటర్లు(రూ.65వేలు)
పెద్దపల్లి జిల్లా:	
లిక్కర్	48లీటర్లు(రూ.17వేలు)
గంజాయి	5కిలోలు(రూ.1.25లక్షలు)
పీడీఎస్‌రైస్	క్వింటాల్



బస్సులో తనిఖీ చేస్తున్న పోలీసులు

చెక్‌పోస్టులు:
మంచిర్యాల జిల్లా:
పారుపల్లి(అంతర్‌రాష్ట్ర), ఇందన్‌పల్లి, ఇందారం, తాండూర్, గూడెం
పెద్దపల్లి జిల్లా:
దుబ్బపల్లి, గుంపుల, ఎక్లాస్‌పూర్, గోదావరి బ్రిడ్జి

గోదావరిఖని: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలుబడటంతో పోలీసులు అప్రమత్తమైయ్యారు. రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో పోలీసు బలగాలను మోహరించారు. నగదు ప్రవాహంపై దృష్టి సారించారు. రూ.50వేల కన్నా ఎక్కువ వెంట తీసుకెళ్తే కచ్చితమైన ఆధారాలు చూపించాల్సిందేనని స్పష్టం చేస్తున్నారు. లేకుంటే సీజ్ చేస్తామంటున్నారు. ఇదే క్రమంలో ఈనెల 4న రామగుండం పోలీస్ కమిషనరేట్ కోటపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అంతర్ రాష్ట్ర సరిహద్దు పారుపల్లి చెక్‌పోస్టు వద్ద రూ.1.90లక్షలను సీజ్ చేశారు. మహారాష్ట్రలో ఎన్నికలు లేకపోవడంతో కోడ్ విషయం తెలియక కారులో ఓ వ్యక్తి నగదు తీసుకెళ్తున్నాడు. రూ.50వేల కన్నా ఎక్కువ తీసుకెళ్తుండడంతో సీజ్ చేశారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్రంలో చాలాజరుగుతున్నాయి.

పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఆందోళన..

పెళ్లిళ్ల సీజన్ కావడంతో బంగారం, వెండి, ఇతర విలువైన ఆభరణాల కొనుగోలు కోసం పెద్దమొత్తంలో నగదు అవసరం ఉంటుంది. పది గ్రాముల బంగారం కొనుగోలు చేయాలన్నా కనీసం రూ.1.20లక్షలు అవసరం అవుతోంది. ఈక్రమంలో నగదు వెంట తీసుకెళ్లడం తప్పనిసరి. కొంతమంది ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా కొనుగోలు చేస్తున్నా.. చాలామంది నగదు రూపేణా లావాదేవీలు జరుపుతున్నారు. ఈక్రమంలో పోలీసులు అధిక డబ్బులు తీసుకెళ్తున్నారని సీజ్ చేస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అసలు ఎన్నికలకు సంబంధించిన డబ్బులు చాపకింద నీరులా వెళ్తాయని, ఎన్నికల కమిషన్ అతి నిబంధనలతో తాము ఇబ్బందిపడాల్సి వస్తోందన సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బ్రాందీ షాపుల టెండర్లు..

రాష్ట్రప్రభుత్వం బ్రాందీషాపుల టెండర్లను ప్రారంభించింది. రెండేళ్ల కాలపరిమితికి ఒక్కోషాపు వేలంలో పాల్గొనేందుకు రూ.3లక్షలు చెల్లించి డీడీ తీయాలని సూచించింది. దీంతో చాలామంది టెండర్లలో పాల్గొనేందుకు నగదు వెంట తీసుకెళ్లడం సహజం. స్థానిక ఎన్నికల కోడ్ కూసిన క్రమంలో తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఈక్రమంలో పట్టణాల్లో మినహాయించి స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న ప్రాంతాల్లో ఈనిబంధన ఉండాలని కోరుతున్నారు.

నిబంధనలు పాటిస్తాం



ఎన్నికల నిబంధనల మేరకు వ్యవహరిస్తాం. నిబంధనలు అతిక్రమించి రూ.50వేలకుపైగా వెంట తీసుకెళ్తే అందుకు తగిన ఆధారాలు చూపించాల్సి ఉంటుంది. లేకుంటే రూ.50వేల కన్నా ఎక్కువ ఉన్నసొమ్మును సీజ్ చేస్తాం. జిల్లా సరిహద్దులతో పాటు అంతర్ రాష్ట్ర సరిహద్దు అయిన కోటపల్లి మండలం శివారులోని మహారాష్ట్ర బ్రిడ్జి వద్ద చెక్ పోస్టు ఏర్పాటు చేశాం. నగదు, మద్యం రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నాం.

– అంబర్ కిశోర్ ఝా, పోలీస్ కమిషనర్, రామగుండం





రాజన్నకు అభిషేకాలు

వేములవాడ: రాజన్నను సోమవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. గర్భగుడి దర్శనాలు రద్దుచేసిన ఆలయ అధికారులు భక్తుల సౌకర్యార్థం ఈ సోమవారం అభిషేకాలు, అన్నపూజ, ఆకులపూజలకు అనుమతినిచ్చారు. రాజన్నను నిజామాబాద్ జిల్లాకు చెందిన అంతర్జాతీయ హాకీ ప్లేయర్ ఎండాల సౌందర్య దర్శించుకున్నారు. అర్చకులు స్వామి వారి ప్రసాదాలు అందించి సత్కరించారు. భక్తుల ఏర్పాట్లను ఈవో రమాదేవి, ఏఈవోలు, పర్యవేక్షకులు పరిశీలించారు.

‘అడవిలో అన్నలు’ సిరిసిల్లలో కలిశారు!

సిరిసిల్ల: సిరిసిల్లకు వచ్చిన మంత్రి సీతక్కను అప్పటి అన్నలు కలిశారు. ములుగు జిల్లాకు చెందిన ధనసరి అనసూర్య ఉరఫ్ సీతక్క 1985–92 ప్రాంతంలో సీపీఐ(ఎంఎల్) జనశక్తిలో దళనేతగా పనిచేశారు. అనంతరం ఆమె జనజీవన స్రవంతిలో కలిశారు. రాజకీయాల్లోకి వచ్చారు. ప్రస్తుతం మంత్రిగా పనిచేస్తున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు సోమవారం సిరిసిల్లకు వచ్చిన మంత్రిని జనశక్తి మాజీ నక్సల్స్ కోనరావుపేట మండలం వెంకట్రావుపేటకు చెందిన బుర్ర మల్లేశంగౌడ్ ఉరఫ్ కుమారన్న, ఇదే మండలంలోని మల్కాపేటకు చెందిన బుట్టం చంద్రయ్య ఉరఫ్ సోమన్న కలిశారు. గతంలో సీతక్కతో కలిసి పనిచేసిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. ఇది ఇలాఉంటే 1989లో గ్రెనేడ్ పేలి సోమన్న చేయి నుజ్జునుజ్జయ్యింది. అనంతరం వ్యక్తిగత కారణాలతో 1995లో ఆయన జనజీవన స్రవంతిలో కలిశారు. మరో నాయకుడు కుమారన్న వరంగల్ జిల్లాలోనే ఎక్కువ కాలం పనిచేశారు. 1989లో జనజీవన స్రవంతిలో కలిశారు. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ముష్టిపల్లి సర్పంచ్, ఉపసర్పంచగా పనిచేశారు.



మంత్రి సీతక్కతో నాటి జనశక్తి దళానాయకులు సోమన్న, కుమార్

ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందానికి సింగరేణి రెస్క్యూ శిక్షణ



రెస్క్యూ స్టేషన్ వద్ద ఎన్‌డీఆర్‌ఎఫ్ సభ్యులు, సింగరేణి అధికారులు

- మొదటి బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభం

గోదావరిఖని: నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) సభ్యులకు సింగరేణి యాజమాన్యం సోమవారం శిక్షణ ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల్లోని 10వ బెటాలియన్‌కు చెందిన మొదటి బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్నారు. భూగర్భగనుల్లో ప్రమాదాలు జరిగిన సమయంలో వ్యవహరించాల్సిన తీరుపై ఒక్కో బ్యాచ్‌కు 14రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. జాతీయ స్థాయిలో ప్రత్యేకతను సంతరించుకున్న సింగరేణి రెస్క్యూ ద్వారా ఎన్‌డీఆర్‌ఎఫ్‌కు శిక్షణ ఇవ్వాలని కేంద్ర ఎన్‌డీఆర్‌ఎఫ్, మినిస్టరీ ఆఫ్ హోం ఎఫైర్స్, డీజీఎంఎస్, సింగరేణి సంస్థ కలిపి ఈనిర్ణయం తీసుకున్నాయి. శ్రీశైలం ఎస్‌ఎల్‌బీసీ సంఘటన సమయంలో సింగరేణి రెస్క్యూ బృందాల పనితీరు దేశవ్యాప్తంగా తెరపైకి వచ్చింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో కూడా ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు పనిచేయాలనే ఆలోచనతో ఈశిక్షణకు అంకురార్పన జరిపారు. మొదటి బ్యాచ్‌లో 30మంది సభ్యులు ఉంటారని, ఈ బెటాలియన్‌లో 18 బ్యాచ్‌లు ఉంటాయని అసిస్టెంట్ కమాండర్ కె.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈశిక్షణను ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య, ఏరియా సేఫ్టీ జీఎం మధుసూదన్, రెస్క్యూ జీఎం శ్రీనివాస్‌రెడ్డి, సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. 14రోజుల పాటు రెసిడెన్షియల్ శిక్షణ కొనసాగనుంది.

స్థానిక ఎన్నికల్లో పొత్తు ఉండదు

విద్యానగర్(కరీంనగర్): ఎంఐఎం పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదని ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి యాసర్ అర్ఫాత్ స్పష్టం చేశారు. సోమవారం రాత్రి కరీంనగర్‌లోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో తమ పార్టీ ఒంటరిగా పోటీ చేస్తుందని, పార్టీ అభ్యర్థుల విజయానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, జీహెచ్‌ఎంసీ మాజీ కార్పొరేటర్ సుబహాన్, నాయకులు బర్కత్ అలీ, హాఫిజ్ యూసుఫ్, ఖమరొద్దీన్, ఆతిన, ఖాజా, ఇబ్రహీం, మాజీ కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, ఆరిఫ్ అహ్మద్, మాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యాసర్ అర్ఫాత్

కరీంనగర్‌కు ఒడిశా పోలీసులు

కరీంనగర్‌క్రైం: సైబర్ క్రైం కేసులో ఒడిశా రాష్ట్రానికి చెందిన పోలీసులు సోమవారం కరీంనగర్‌కు వచ్చినట్లు తెలిసింది. కరీంనగర్ టూటౌన్ పరిధికి చెందిన కార్తీక్ అనే వ్యక్తి పాత్ర ఉందని భావించి అతను ఉంటున్న విద్యానగర్ ప్రాంతంలో దర్యాప్తు చేశారు. సైబర్ నేరస్తులు సామాన్యులకు కొంతడబ్బు ఇచ్చి వారి పేర్లపై ఖాతాలు తెరుస్తుండటంతో ఇలాంటి నేరంతో సంబంధాలు ఉన్నాయని అనుమానిస్తున్న పోలీసులు అతడిని అక్కడికి తీసుకెళ్లినట్లు సమాచారం.

కుక్కల దాడిలో మహిళలకు తీవ్ర గాయాలు



మహిళ తలపై గాయం

మేడిపల్లి: భీమారం మండలం మన్నెగూడెంలో వాసం గంగు ఉదయం ఇంటి పనులు చేస్తుండగా.. ఓ కుక్క విచక్షణారహితంగా దాడి చేయడంతో ఆమె తలపై తీవ్రగాయాలయ్యాయి. ఆమెను వెంటనే జగిత్యాల ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. మేడిపల్లి, భీమారం మండలాల్లో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

- జగ్గాసాగర్ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడి ఘటనలో..

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ సదానందంపై దాడి చేసిన ఘటనలో ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు చేపట్టారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా త్రీఫేజ్ సరఫరా చేయాలని మెట్‌పల్లి రూరల్ సెక్షన్ లైన్ ఇన్స్‌పెక్టర్ వినోద్ సదానందంకు సూచించగా.. ఉన్నతాధికారుల అనుమతి తీసుకుంటానని చెప్పడంతో ఇద్దరి మధ్య ఫోన్‌లో వాగ్వాదం జరిగి దాడి వరకు వెళ్లిన విషయం తెల్సిందే. దీంతో బాధితుడు సదానందం అదేరోజు పైఅధికారులతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన మెట్‌పల్లి ఏడీ అమరేందర్, ఏఈ రమేశ్ ఉన్నతాధికారులకు నివేదించారు. వారిచ్చిన నివేదిక ఆధారంగా లైన్‌ఇన్స్‌పెక్టర్ వినోద్‌ను సస్పెండ్ చేశారు.

వేములవాడలో కొండచిలువ



కొండచిలువను పట్టుకున్న జగదీశ్

వేములవాడ పట్టణ శివారులోని మూలవాగు తీరంలో ధోబీఘాట్ వద్ద 9 ఫీట్ల పొడవు ఉన్న కొండచిలువ సోమవారం కనిపించింది. దీన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ట్రాఫిక్ ఎస్సై రాజు అక్కడికి చేరుకుని పాములు పట్టే జగదీశ్‌కు సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి కొండచిలువను పట్టుకొని అటవీప్రాంతంలో వదిలిపెట్టారు. – వేములవాడ

యువకుడిపై దాడి

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రం వెంకంపేట ప్రాంతంలో సోమవారం పాతపగలతో జరిగిన దాడి ఉద్రిక్తతకు దారితీసింది. స్థానికులు తెలిపిన వివరాలు. వెంకంపేటకు చెందిన రాజశేఖర్‌పై అదే పట్టణానికి చెందిన హరికృష్ణ, విగ్నేశ్, నరేశ్‌లు కర్రలతో దాడి చేశారు. ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దాడి చేయగా అడ్డుకునేందుకు ప్రయత్నించినా వినకుండా విచక్షణారహితంగా కర్రలతో కొట్టారు. తలపై గాయాలతో రక్తస్రావమైన రాజశేఖర్ వెంటనే హాస్పిటల్‌లో చికిత్స పొంది, స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ దాడితో బాధితుని ఉండే ఏరియాలో నివసించే వారు భయాందోళన చెందుతున్నారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.



గాయపడిన రాజశేఖర్

పంటలకు తెగుళ్ల బెడద

- ఎడతెరిపిలేని భారీవర్షాలు కారణం
- కోతదశకు వచ్చిన వరిపైరు
- మొగ్గ, పగిలే దశలో పత్తిపంట
- దిగుబడిపై తీవ్రప్రభావం
- లబోదిబోమంటున్న రైతులు



ఓదెల : మడకలో పత్తికి సోకిన తెగులు



సుల్తానాబాద్: ఎర్రగా మారిన వరిపైరు కాండం

సుల్తానాబాద్/జూలపల్లి/ఓదెల(పెద్దపల్లి): కొద్దిరోజులుగా కురుస్తున్న భారీవర్షాలతో వరి, పత్తి పంటలకు తెగుళ్లు ఆశిస్తున్నాయి. వర్షాకాలం ఆరంభంలో ఆలస్యంగా కురిసిన వానలు.. ఇప్పుడు సీజన్ చివరిదశకు వచ్చినా భారీవర్షాలు కురుస్తుండడంతో పంటలు దెబ్బతింటున్నాయి. వీటికితోడు వాతావరణంలో ఆకస్మిక మార్పులతోనూ వరి, పత్తి పంటలకు వివిధ తెగుళ్లు ఆశిస్తున్నాయి. మరో నెలరోజుల్లో పంటలు చేతికి వస్తాయి. ఈ క్రమంలో తెగుళ్లు ఆశించడంతో దిగుబడిపై ప్రభావం పడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. భారీవర్షాలతో వరి పంటను తెగుళ్లు ఆశిస్తున్నాయి. గింజదశలోని పంటను ఆశించడంతో దిగుబడి తగ్గుతుందని, అంతేకాకుండా తాలు అధికంగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అన్నదాతలను ముంచిన భారీ వర్షాలు

జూలపల్లి మండలంలోని కోనరావుపేట, నాగులపల్లె, కల్లెంరెడ్డిపల్లె, తెలుకుంట తదితర గ్రామాల్లోని వరిపంట కోతదశకు చేరింది. గింజగట్టిపడక ముందే ఏకధాటివానలతో తాలుగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాగులపల్లె, తెలుకుంట, కల్లెంరెడ్డిపల్లెలో వర్షం ధాటికి దాదాపు 30 ఎకరాల్లో వరిపైరు నేలవాలిందని, గింజలు పనికిరాకుండా పోయానని వాపోతున్నారు.

తెల్లబంగారానికి తెగులు..

ఓదెల మండలంలోని వివిధ గ్రామాల్లో పత్తి పంటకు తెగులు సోకింది. మచ్చతెగుళ్లతో పంట దెబ్బతింటోదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓదెల మండలంలోని 22 గ్రామాల్లో సుమారు 4 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారని అధికారుల అంచనా. ఇందుర్తిలో 250 ఎకరాలు, పొత్కపల్లిలో వెయ్యి , శానగొండలో 500, గుంపులలో 350, ఓదెలలో 570, కొమిరలో 320, కొలనూర్‌లో 200, మడకలో దాదాపు 250 ఎకరాల్లో పత్తి సాగైందని, కొద్దిరోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటకు నల్లమచ్చలు వస్తున్నాయని, మొక్కలు కుళ్లిపోతున్నాయని అన్నదాతల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చే దశలో ఉందని, ఈ సమయంలో కాయలు, బుగ్గలు నల్లగా మారడంతో దిగుబడి తగ్గుతుందని, పెట్టుబడి చేతికి వచ్చే పరిస్థితి లేదంటున్నారు. మరోవైపు.. చేను జాలువారి మొక్కలన్నీ ఎర్రబారుతున్నాయని అంటున్నారు.

ఏఈవోలను సంప్రదించాలి

కొద్దిరోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలతోనే పత్తి పంటకు తెగులు సోకుతోంది. మొక్కలు, ఆకులు, కాయలపై నల్లమచ్చలు ఏర్పడుతున్నాయి. తెగుళ్ల నివారణ కోసం అన్నదాతలు రైతువేదికలో ఏఈవోలను తక్షణమే సంప్రదించాలి.

– రామకృష్ణ, ఏఈవో, కొలనూర్, ఓదెల

ప్రభుత్వం ఆదుకోవాలి



మరో పదిహేను రోజుల్లో వరి పంట కోతకు వస్తుంది. ఈ సమయంలో భారీ వర్షాలు పడుతున్నయి. నాకున్న మూడెకరాల్లో ఏసిన పంటకు నష్టం జరిగింది. పంట నష్టపోయిన మాలాంటి రైతులను ప్రభుత్వమే ఆర్థికంగా ఆదుకోవాలి.

– భూసారపు శ్రీనివాస్, రైతు, కోనరావుపేట

కాయలు నల్లబడ్డాయి



నాకున్న మూడెకరాల్లో ఈ సారి పత్తి పంట ఏసిన. ఏకరాపై రూ.30వేల చొప్పున పెట్టుబడి పెట్టిన. పత్తి పంట కాయ దశకు వచ్చింది. ఏకధాటి వానలతో వైరస్ సోకిందట. కాయలు నల్లగా, ఆకులు ఎర్రగా మారినయి.

– ఉప్పుల అనిత, రైతు, గూడెం

సూచనలు పాటించాలి

వాతావరణంలో వస్తున్న మార్పులు, భారీవర్షాలతోనే తెగుళ్లు ఆశిస్తున్నాయి. వాటి నివారణకు వ్యవసాయాధికారుల సూచన ప్రకారమే పురుగు మందులు వాడాలి. ఇందుకోసం స్థానిక ఏఈవోలను తప్పకుండా సంప్రదించాలి.

– శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి

రెండోసారి పిచికారీ



నాకున్న రెండెకరాల్లో వరి ఏసిన. మెడవిరుపు పురుగు సోకడంతో ఒకసారి పురుగుల మందు కొట్టిన. భారీవానలతో పైరు ఎర్రబడుతంది. అగ్గితెగులు సోకిందంటున్నరు. అధికారుల సూచనతో మరోసారి మందు కొడుతున్న.

– గెల్లు శ్రీనివాస్, రైతు, సుల్తానాబాద్